క్లుప్తంగా

పరామర్శ



విద్యాసాగర్‌రావును పరామర్శిస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కథలాపూర్: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు చీటి విద్యాసాగర్‌రావును ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. విద్యాసాగర్ రావు భార్య విజయమ్మ పదిరోజుల కింద అనారోగ్యంతో మృతిచెందింది. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ఆయనను ఓదార్చారు. ఇక్కడ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, బొడ్డు బాలు, గడీల గంగప్రసాద్, గోపు శ్రీనివాస్, గుండారపు గంగాధర్, కొత్తపెల్లి శ్రీనివాస్, పాలెపు రాజేశ్ తదితరులున్నారు.

నిధుల మంజూరుకు ఎమ్మెల్యే హామీ

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని గీత పారిశ్రామిక సంఘం భవనంపై ఫంక్షన్‌హాల్ కోసం షెడ్ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు గీత పారిశ్రామిక సంఘం సభ్యులు విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వచ్చేనెలలో రూ. 5 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గీత కార్మిక సహకార సంఘం మండల అధ్యక్షుడు చెట్లపెల్లి సత్యానారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేడి లింబాద్రిగౌడ్, నర్సయ్య, కుంట పెద్ద రాజగౌడ్, భూసారపు లింబాద్రి, రామగౌడ్, నారాయణ, మేడి దశగౌడ్, జిల్లా నడ్పన్న, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ కొమ్ము కమలేశ్వర్ తెలిపారు. మల్యాల, నూకపల్లి, ముత్యంపేట, గుడిపేట గ్రామాల్లో విద్యుత్ అంతరాయం సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కథలాపూర్: కథలాపూర్, మేడిపెల్లి, భీమారం మండలాల్లో శుక్రవారం 72 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసినట్లు తహసీల్దార్లు తెలిపారు. తెలంగాణ సంక్షేమ సంబరాల్లో భాగంగా కథలాపూర్ మండలంలో 30 మందికి, మేడిపెల్లిలో 21, భీమారం మండలంలో 21 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు శ్రీనివాస్, ఎం.డీ బషీరొద్దీన్, యూసుఫ్, ప్రజాప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



గర్భిణికి సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి, భూషణరావుపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు శుక్రవారం సీమంతాలు నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కోట రజిత, అల్లాడి సంధ్య, కూన శారద, మల్లీశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

సారంగాపూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఎడమల శైలేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో, రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మండల ఇన్‌చార్జి పడాల తిరుపతి, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మ్యాడ జనార్ధన్, ప్రధాన కార్యదర్శులు ఆడెపు రమేశ్, అప్పాల జలేందర్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం పైసలు పడేదెన్నడో ?

- వానాకాలం ప్రారంభమైనా ఖాతాల్లో జమకాని డబ్బులు
- పెట్టుబడి, విత్తన కొనుగోళ్లకు తిప్పలు
- నెల రోజులుగా అన్నదాతల ఎదురుచూపు



పెగడపల్లిలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

పెగడపల్లి: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు రెండ్రోజుల్లో ఖాతాల్లో డబ్బులు అందేలా చూస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలు నీటి మూటలుగానే మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. మండలంలో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక, ఖరీఫ్ పంటల సాగుకు పెట్టుబడి కోసం ఇబ్బందులు తప్పడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

ఐకేపీ, సహకార సంఘాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర అందించేందుకు ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 31 కేంద్రాల ద్వారా 5,074 మంది రైతుల 3.18 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 9 కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.13.59 కోట్ల విలువైన 66 వేల క్వింటాళ్లు, పెగడపల్లి సహకార సంఘం నుంచి 10 కేంద్రాల ద్వారా రూ.26.78 కోట్లు విలువైన 1.30 లక్షల క్వింటాళ్లు, నంచర్ల సహకార సంఘం నుంచి 8 కేంద్రాల ద్వారా రూ. 16,68 కోట్ల విలువైన 81 వేల క్వింటాళ్లు, నందగిరి సహకార సంఘం ద్వారా రూ. 844 కోట్లు విలువైన 41 వేల క్వింటాళ్ల చొప్పున ధాన్యం సేకరించారు. ఈ కేంద్రాల ద్వారా రూ.62 కోట్ల 17 లక్షల, 80 వేలు రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికి వరకు రూ. 31 కోట్లు 17 లక్షలు రైతుల ఖాతాల్లో జమకాగా 31కోట్ల 80 వేలు ఇంకా రైతుల ఖాతాల్లో జమకావాల్సి ఉంది. డబ్బులు జమకాని రైతులు ఐకేపీ, సహకార సంఘాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రెండు మూడు రోజుల్లో జమకావాల్సి ఉన్నా..

రైతుల వివరాలు ప్రస్తుతం క్రయ విక్రయాలకు సంబంధించిన అన్ని లావాదేవీలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల ఆధార్ కార్డులు, బ్యాంకుఖాతా నంబర్లతో సహా అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి నివేదికలు పంపించారు. అయితే ధాన్యం తూకం వేసిన రోజు, రైస్‌మిల్లుకు చేరిన రోజును బేరీజు వేసి కనీసం 2, 3 రోజుల వ్యవధిలో డబ్బులు చెల్లించాల్సి ఉంది. 25 రోజుల క్రితం ధాన్యం విక్రయించినా రైతులకు ఇప్పటికీ వారి ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. సమాచారం కోసం ఐకేపీ, సహకార సంఘాల అధికారుల వద్దకు వెళ్తే డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని చెబుతున్నారని రైతులు తెలుపుతున్నారు.

పెట్టుబడికి తిప్పలవుతుంది



15 రోజుల కింద వడ్లు అమ్మాను. బ్యాంకులో డబ్బులు జమయ్యేందుకు అవసరమైన అన్నిపత్రాలు అందించాను. కానీ ఇప్పటి వరకు ఖాతాల్లో జమకాలేదు. సొసైటీ సిబ్బందిని అడిగితే తాము పంపించామని, డబ్బులు మీ ఖాతాలో జమవుతాయని చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన పెట్టుబడి కోసం తిప్పలవుతంది.

– కాటం నర్సింహారెడ్డి, పెగడపల్లి

ఇంకా డబ్బులు రాలే



నేను ధాన్యం అమ్మి నెల రోజులవుతుంది. ఇంకా ధాన్యం డబ్బులు చేతికి అందలేదు. మా ఊళ్లో కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మాను. కానీ నెల రోజులయినా చేతికి డబ్బులు అందకపోవడంతో మళ్లీ అప్పులు తెచ్చే పరిస్థితి నెలకొంది.

– అజ్మీరా లక్ష్మణ్ నాయక్, మద్దులపల్లి

పట్టించుకోవాలి



ధాన్యం డబ్బుల చెల్లింపుల విషయంలో సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవాలి. వానాకాలం ప్రారంభం కావడంతో పెట్టుబడికి, విత్తనాలు కొనుగోళ్లకు ఇబ్బంది అవుతుంది. ఇప్పటికైనా డబ్బులు అందని రైతులకు ఖతాల్లో జమయ్యేలా చూడాలి.

– మ్యాకల మల్లేశ్ యాదవ్, రైతు, ఐక్యవేదిక నాయకుడు

రైతులు ఆందోళన చెందొద్దు

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపించాం. వరుస క్రమంలో ఖాతాలో డబ్బులు జమవుతున్నాయి. పదిహేను రోజులుగా డబ్బులు విడుదల కావడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే రైతుల ఖతాల్లో జమయ్యేలా చూస్తాం

– కేంద్రాల నిర్వాహకులు



బోనాలు సమర్పించిన గంగపుత్రులు

ఘనంగా గంగామాత బోనాలు

వెల్గటూర్: మండలంలలోని స్తంభంపల్లిలో గంగామాత బోనాలను ఘనంగా నిర్వహించారు. బుగ్గారం మండలం బీరుసాని గ్రామానికి చెందిన గంగపుత్రులు వెంకటాపూర్ మీదుగా స్తంభంపల్లికి చేరుకొని గ్రామానికి చెందిన గంగపుత్రులతో డప్పు చప్పుళ్లమధ్య గంగామాత ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్లూరి రూపారాణి, ఎంపీటీసీ పాడేటి సతీశ్, మాజీ సర్పంచ్ పాడేటి లక్ష్మీ, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నాగుల రాజయ్య, ప్రధా న కార్యదర్శి గుమ్ముల శంకరయ్య, ఉపాధ్యక్షుడు గుమ్ముల గంగయ్య, డైరెక్టర్లు నాగుల రమేశ్, బోరె ఉషయ్య, గంగధరి గణేశ్, వెంకటేశ్, రాజబోయ్, తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించండి



చిట్టాపూర్‌లో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మల్లాపూర్ : బడీడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొల్కిమోర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్టాపూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవన్, గోవర్ధన్, సామాజిక కార్యకర్త విష్ణువర్ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీవో నంబరు 60 ప్రకారం వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పులి మల్లేశం డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారికి శుక్రవారం ఆయన ఒక వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల్లో సుమారు 50 వేల సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. సుమారు 30ఏళ్లుగా పనిచేస్తున్నా క్రమబద్ధీకరణకు నోచుకోవడం లేదన్నారు. కనీస వేతనం నెలకు రూ.19వేలు చెల్లించాలన్నారు. నాయకులు కోమటి చంద్రశేఖర్, కనికరపు సత్తయ్య, రాజేశం, బేతి లక్ష్మణ్, అంజన్న, రాజేశ్వర్, జంగు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల గ్రామ పంచాయతీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ తమకు రూ. 19వేలు చెల్లించాలని, డిమాండ్లు అమలు చేయని పక్షంలో ఈనెల చివరి వారం నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

- పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్

మల్లాపూర్ : సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మండల అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల పోరాటానికి పీఆర్టీయూ, డీటీఎఫ్ యూనియన్ల మద్దతు ఇవ్వాలని వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ యూనియన్ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు ప్రతాప్, దేవారెడ్డి, విజయప్రసాద్, నరేశ్, పీఆర్టీయూ, డీటీఎఫ్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

వెల్గటూర్ : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కనీస వేతన స్కేలు అమలు చేయాలని కోరుతూ సమగ్రశిక్ష సిబ్బంది మండల విద్యాధికారి బత్తుల భూమయ్యకు వినతిపత్రం అందజేశారు. 2022– 23 సంవత్సరం రాష్ట బడ్జెట్ సమావేశాల్లో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు 2023 ఏప్రిల్ నుంచి ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేస్తామని, వేతనాల పెంపు చేపడతామని చెప్పడం హర్షణీయమన్నారు. విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న తమ సేవలు గుర్తించాలని కోరారు. జీవితబీమా, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని కోరారు. సమగ్రశిక్ష ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు దశల వారి నిరసన కార్యక్రమాలకు మద్దతు ప్రకటించాలన్నారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్ కవిత, సీసీవో శ్రీనివాస్, వెల్గటూర్, బుగ్గారం పీఆర్సీలు వైద్య వెంకటేశ్, రాజారాణి, రజని, పురుషోత్తం, రాజేశ్, ఐఈ ఆర్పీలు శ్రీనివాస్, శ్రీలత, మెసెంజర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల/ జగిత్యాల రూరల్: సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం తిప్పన్నపేట శివారులోని సుమంగళి గార్డెన్స్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సంక్షేమ సంబరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. నియోజకవర్గంలో 62 వేల మందికి పింఛన్ అందుతుందని, కులవృత్తుల వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళిక రూపొందించారన్నారు. బీసీ బంధు పథకం ద్వారా 13 బీసీ కులాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 5వేల మంది కుటుంబాలకు 100 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యతో పాటు, వసతులను కల్పిస్తున్నట్లు తెలిపా రు. అనంతరం కులవృత్తుల వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గొడిశెల రాజేశం గౌడ్, అదనపు కలెక్టర్ మకరంద్, ఆర్డీవో మాధురి, జిల్లా సంక్షేమాధికారి నరేశ్, మున్సిపల్ చైర్మన్లు గోలి శ్రీనివాస్, మోర హన్మండ్లు, ఎంపీపీలు కోల జము న, ములాసపు లక్ష్మీ, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రత అందరి బాధ్యత

పచ్చదనం, పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం అమరవీరుల స్థూపం పార్క్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల కోసం పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉద్యానవనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఉద్యానవనాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివకేసరి బాబు, గిరి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం



ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని వెల్లుల్లలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి సంక్షేమ సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో ప్రతినెలా ఎనభై వేల మందికి పైగా పింఛన్లు అందుతున్నాయన్నారు. త్వరలోనే ప్రభుత్వం గృహలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తుందని, పేదలు ఇల్లు కట్టుకునేందుకు రూ.3లక్షలు అందించనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్‌కు అండగా నిలవాలన్నారు.

అర్హులకు స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి

మండలంలోని కోనరావుపేటలో అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సమావేశానికి తరలివచ్చిన గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి అర్హులకు స్థలాలు కేటాయిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రీసర్వే జరిపి అర్హులకు మాత్రమే స్థలాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆర్డీవో వినోద్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కుంటల అభివృద్ధితో మేలు

- గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యుల కితాబు
- జిల్లాలో 'అమృత్ సరోవర్' కుంటల పరిశీలన



కుంటను పరిశీలిస్తున్న సభ్యులు

మెట్‌పల్లి(కోరుట్ల): ఆత్మనగర్ శివారులో ఉపాధిహామీ నిధులు రూ.6లక్షలతో నిర్మించిన అమృత్ సరోవర్ ఊటకుంటను గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర బృందం సభ్యులు శ్రీదేవి, రఘు పరిశీలించారు. నిర్మాణ తీరును చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. వర్షాకాలంలో సమీపంలోని గుట్టలపై నుంచి వర్షపు నీరు కుంటలోకి వచ్చి చేరుతోందని.. తద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెందడంతోపాటు పశువులు, పక్షులకు తాగునీటి సమస్య ఉండదని స్థానిక అధికారులు వారికి వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, ఏపీవో తిరుపతిరావు, సర్పంచ్ జరుపుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల చెరువు పరిశీలన

కథలాపూర్(వేములవాడ): భూషణరావుపేట తుమ్మల చెరువును ఉపాధిహామీ రాష్ట్ర అధికారులు శ్రీదేవి, రఘు శుక్రవారం పరిశీలించారు. అమృత్ సరోవర్ పథకంలో చేపట్టిన చెరువు మరమ్మతులు తనిఖీ చేశారు. చెరువు ప్రాధాన్యత గురించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ డీఆర్డీవో బాలె శివాజీ, విజిలెన్స్ అధికారులు రాజేంద్రప్రసాద్, వెంకటప్రసాద్, ఏపీవో రాజేందర్, ఈసీ లక్ష్మయ్య, టీఏ శ్రీధర్, కార్యదర్శి ఎండీ గఫూర్, కూన శ్రీనివాస్, అశోక్ ఉన్నారు.

గోధూర్‌లో ముగిసిన 'కంటివెలుగు' శిబిరం



శిబిరం ముగింపులో వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు

ఇబ్రహీంపట్నం : మండలంలోని గోధూర్ గ్రామంలో గతనెల 19 నుంచి కంటి వెలుగు శిబిరం నిర్వహించగా శుక్రవారం ముగిసిందని వైద్యాధికారి శ్రీజ తెలిపారు. వైద్యశిబిరంలో 2,230 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 431 మందికి కళ్లద్దాలను అందజేశారు. శిబిరాన్ని వైద్య సిబ్బంది విజయవంతంగా నిర్వహించినందుకు ఎంపీపీ జాజాల భీమేశ్వరి వైద్య సిబ్బందిని సన్మానించారు. సర్పంచ్ సోమ ప్రభాకర్, ఉపసర్పంచ్ నల్ల తిరుపతి, వీడీసీ అధ్యక్షుడు బొరం సంజీవ్, వైద్యాధికారులు శ్రీజ, రాజేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశం, అప్తామెట్రిస్ట్ అభిషేక్, ఏఎన్ఎంలు సుప్రియ, పద్మ, డీఈవో మనీష, పంచాయతీ కార్యదర్శి రాజన్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

- ఆవిర్భావ విందు

ధర్మపురి : రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సంక్షేమం సంబరాల సందర్భంగా శుక్రవారం రాత్రి ముస్లింలకు ఆవిర్భావ విందు ఏర్పాటు చేశారు. దొంతాపూర్‌లో సర్పంచ్ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో విందు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.